క్లుప్తంగా

'ఉపాధి హామీ' నివేదికలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

మంగపేట : 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులపై నివేదికలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారిగా ఉపాధి పనుల నివేదికలు సిద్ధం చేసి అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, ఏపీఓ సునీత, ఎంపీఓ మమత, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



ఏటూరునాగారం : ఏటూరునాగారం నుంచి తుపాకులగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు..ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తాటిపెల్లి రామయ్యను ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో చోటు చేసుకుంది. మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తాటిపల్లి రామయ్య తన భార్యతో కలిసి ఏటూరునాగారం వచ్చి పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కాలు విరిగింది. చికిత్స నిమిత్తం ఆయనను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కోసం నేడు (గురువారం) విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారి సునీల్ బుధవారం తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, అంతరాయానికి మండల ప్రజలు సహకరించాలని కోరారు.

పరామర్శ

వెంకటాపురం(ఎం) : ఆస్తి తగాదాలతో అన్న చేతిలో దాడికి గురైన పొన్నం సారక్కను బుధవారం ఆరెపల్లిలోని ఎస్ఎస్ఆర్ ఆస్పత్రిలో వెంకటాపురం ఎస్సై చల్లా రాజు పరామర్శించారు. సారక్క ఆరోగ్య పరిస్థితిని వైద్యులను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సారక్క ఆపరేషన్ కోసం కొంత ఆర్థికసాయాన్ని అందిస్తానని ఎస్సై పేర్కొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

మహాముత్తారం : మండలంలోని యామన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు టై, బెల్టులు పంపిణీ చేశారు. తన స్నేహితులు, శ్రీహన్, శ్రీనివాస్ సహకారంతో రూ. 3వేల విలువచేసే టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతి, విజయ్‌కుమార్, మంజుల, సీఆర్పీ బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

మహాముత్తారం : మండలంలోని గాజరాంపల్లి గ్రామానికి చెందిన కోడి మధునమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బుధవారం బోర్లగూడెం మాజీ సర్పంచ్ రజిత సుగుణాకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 25కేజీల బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, దేవయ్య, పవన్ తదితరులు ఉన్నారు.

నిత్యావసరాలు..

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ముకునూరు పాలెంలో బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై రేక అశోక్ పంపిణీ చేశారు. కందిపప్పు, నూనె, పసుపు, వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి సంస్థ సాయం చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, ఇందిర, పద్మ, ఉషా తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మహాముత్తారం : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం సీనియర్, జూనియర్ కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు లావుడ్య ప్రకాష్, పీఈటీ విజయలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష చూపొద్దు

- చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నరేష్
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

మంగపేట : బాలికల పట్ల వివక్ష చూపొద్దని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని తిమ్మంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాలికను రక్షిద్దాం..బాలికలను చదవనిద్దాం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు వ్యసనాలకు అలవాటు కాకూడదని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ చారి, నాగమ్మ, రాంబాబు, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయడం నేరం

ఏటూరునాగారం : బాల్య వివాహాలు చేయొద్దని, అది నేరమని వైద్యాధికారి సుచరిత అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు హాజరై మాట్లాడారు. వయస్సు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం బాలికలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు స్రవంతి జెండర్, సీసీఐ హోం మదర్ సౌజన్య వివరించారు. మగ, ఆడ పిల్లలను కూడా సమానంగా చూడాలన్నారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, రమాదేవి, నర్సయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటరమణ, సంధ్య, భూమిరెడ్డి, అవంతిక, వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాలికల హక్కులను కాపాడాలి

బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏటూరునాగారం తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్నటువంటి హక్కులను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లయ్య మాట్లాడుతూ.. బాలికలు తమ రక్షణకు కరాటే నేర్చుకోవాలని సూచించారు. బాలికలను చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మడి అరుణ, టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం

ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత అన్నారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, ములుగు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ బాల స్వస్థ్ వైద్య బృందం విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బాల బాలికలకు వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం అన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నిరంతరం వ్యాయామం చేయాలన్నారు. బాలికలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్. బి నరహరి, డాక్టర్ సుజాత, ఫార్మసిస్ట్ భాస్కర్, ఏఎన్ఎం రజిని, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: రామన్నగూడెంలో సూచనలిస్తున్న వైద్యాధికారి సుచరిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్

బాలికలు ఎదగాలి

గోవిందరావుపేట : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కోఆర్డినేటర్లు బద్దం సుదర్శన్‌రెడ్డి, అర్షం రాజు హాజరయ్యారు. అనంతరం ఎంఈఓ దివాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, బాలికలకు మార్షల్ ఆర్ట్ నేర్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు మండలంలోని అన్ని పాఠశాలలో బాలికలకు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా కోఆర్డినేటర్లు బద్దం సుదర్శన్ రెడ్డి, అర్షం రాజు మాట్లాడుతూ.. బాలికలకు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చిన్న వయస్సులో చేయకూడదని, అది చట్టరీత్యా నేరం అని అన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పైబడిన తర్వాత మాత్రమే వివాహం చేయాలి అని అన్నారు. బాలికలు ఎదగడమే రేపటి సమాజానికి మంచి పునాది అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్న మేరి, వనజ, పద్మజ, అంజలి, రేణుక, అనిత భాయ్, రాజు ఎమ్మార్సీ సిబ్బంది విష్ణు, సీఆర్పీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం)లో..

బాలికలకు అవగాహన

వెంకటాపురం(ఎం) : మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలిపారు. బాలికలకు ఉండే హక్కులు, విద్యా, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, సంగీత, వాణి, రవికుమార్, కుమార్ పాల్గొన్నారు.



మంగపేట: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



గోవిందరావుపేట: మాట్లాడుతున్న ఎంఈఓ దివాకర్



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భగవద్గీత

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న అశోక్

గోవిందరావుపేట : మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మంత్రి సీతక్క మిని అంగన్‌వాడీ కేంద్రాలను, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ మొదటి సంతకం చేశారని, ఆసియాలోనే అతి పెద్ద గిరిజన మేడారం జాతరకు రూ.75 కోట్లు మంజూరు చేయించారన్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి అంతర్గత రోడ్ల కోసం రూ.2.50 కోట్లు సీసీరోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాలడుగు వెంకటకృష్ణ, రసపుత్ సీతారాం నాయక్, పన్నాల ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పులుగుజ్జు వెంకన్న, పెండెం శ్రీకాంత్, నాగేందర్ రావు, కృష్ణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

మొగుళ్లపల్లి : మండలంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం భూపాలపల్లి డీఎస్పీ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే వారి పట్ల గౌరవంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై మాధవ్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

కాటారం : మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై అభినవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఎస్సై వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై కుటుంబాలకు దూరం కావాల్సి వస్తుందన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కేసుల పాలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.

సామాజిక సేవాదృక్పథం అభినందనీయం



విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న సీఐ రాజు

మంగపేట : సామాజిక సేవా దృక్పథంతో జ్వాలా యూత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఏటూరునాగారం సీఐ రాజు అన్నారు. ట్రస్ట్ తరఫున దాతల సహకారంతో సేకరించిన రూ. 40వేలు విలువ గల బూట్లను తహసీల్దార్ వీరస్వామితో కలిసి మండలంలోని కమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మహోన్నత స్థాయికి చేరుకోవాలని ఆశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, జ్వాలా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, ఉపాధ్యక్షుడు పుల్లంశెట్టి అజయ్‌కుమార్, ముకుందం, రవి, సతీశ్, రాజు, నగేష్, మహేష్, ఇంతియాజ్, నరేష్‌రెడ్డి, మల్లయ్య, సయ్యద్‌బాబా, సురేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రావు, వెంకట్‌రెడ్డి, కృష్ణ, రాజేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కిషన్

గోవిందరావుపేట : వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని చల్వాయి పంచాయతీలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ టి.కిషన్ హాజరై మాట్లాడారు. చల్వాయి గ్రామంలో ప్రతి ఒక్కరికి ఎయిడ్స్ (హెచ్ఐవీ), సుఖ వ్యాధుల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎవరికైనా సందేహం ఉంటే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష, టీబీ పరీక్ష, సుఖ వ్యాధుల పరీక్షలు చేయించుకోవాలి అని అన్నారు. ఉప సర్పంచ్ తేళ్ల హరి ప్రసాద్, కార్యదర్శి భారతి, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ ఆరుంధతి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

రేగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు మండలంలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అర్హులు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020 నవంబర్ 1, నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులు అర్హులన్నారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా తమ ఓటు నమోదు చేసుకున్నప్పటికీ మళ్లీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

చిట్యాల : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుమన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీఎల్ఓల వద్ద గాని, స్థానిక తహసీల్దార్ వద్ద గాని, అలాగే ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఫారం–18 తో దరఖాస్తు చేసి డిగ్రీ మెమో, ఆధార్ జిరాక్స్‌ల పైన గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవాలి

స్వచ్ఛ మేడారమే ధ్యేయంగా..



గోవిందరావుపేట: ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న సిబ్బంది



ములుగు రూరల్: చెత్త సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

గోవిందరావుపేట : మేడారం జాతర సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారులు చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని బుధవారం వన్యప్రాణి క్షేత్ర విభాగం అధికారి శిరీష గోవిందరావుపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. మేడారం జాతరకు వచ్చే భక్తులు తీసుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలను మండల కేంద్రం నుంచి సేకరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సెక్షన్ ఆఫీసర్లు సందీప్, నర్సయ్య, శివప్రసాద్ బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి

ములుగు రూరల్ : అటవీ సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఇంచర్ల పరిధి ఎర్రి గట్టమ్మ వద్ద రెండో విడత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. గట్టమ్మ పరిసరాల్లో 200 కేజీల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం మహా జాతరకు వచ్చే భక్తులు విడిది ప్రాంతాల్లో ప్లేట్లు, ఇతర చెత్తను చెత్త కుండీలలో వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ జోగేందర్, ములుగు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతర పనుల్లో లోపిస్తున్న నాణ్యత

జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనుల్లో నాణ్యత లోపిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆరోపించారు. మేడారంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను పార్టీ నాయకులతో కలిసి నాగజ్యోతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారుగా కోటి మందికి పైగా భక్తులు హాజరయ్యే మేడారం జాతర పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలు భారీగా పెంచి ఆ డబ్బులు జాతర పనుల పేరుతో అధికార పార్టీ నాయకుల జేబులు నింపుతుందన్నారు. ఊరట్టం నుంచి కాల్వపల్లికి వెళ్లే మట్టి రోడ్డు పోసిన 10 రోజులకే దుమ్ముతో అధ్వానంగా మారిందని తెలిపారు. రూ. 25లక్షలతో ప్రారంభించిన మేడారం, కొండాయి, ఊరట్టం రోడ్డు పగుళ్లు పట్టి కంకర తేలడంతో భక్తులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. సౌకర్యాలు పెంచి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. పస్రా నుంచి లింగాల వెళ్లే రోడ్డు మధ్యలో దాదాపుగా 10కిలో మీటర్ల మేర కంకర పోసి సంబంధిత గుత్తేదారు వదిలేసిన పనులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీపీ గొంది వాణి, దండుగల మల్లయ్య, సర్పంచ్‌లు చిడం బాబూరావు, గొంది శ్రీధర్, నాగమ్మ, నాయకులు పోలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్



విద్యార్థికి రక్త పరీక్ష చేస్తున్న వైద్యురాలు



రక్త పరీక్ష చేస్తున్న వైద్యాధికారులు

ములుగు రూరల్: పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని గురుకులాల వరంగల్ రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీఓ) విద్యారాణి అన్నారు. మండల పరిధిలోని జాకారం గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురుకుల పాఠశాలలో అనీమియా ముక్త్ భారత్ పైలట్ ప్రాజెక్టులో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమతుల ఆహారం తీసుకుంటేనే రక్తహీనత రాదని తెలిపారు. అనంతరం వైద్యులు విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత కలిగిన విద్యార్థులకు పౌష్టికాహారంపై పలు సూచనలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్, శ్రీలత, పాఠశాల వైద్యుడు ఆంజనేయులు, ఫార్మసిస్టు మాధురి, ఏఎన్ఎం సుభాషిణి, పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి, పిచ్చిరెడ్డి, శ్రీధర్ రావు, రాంరెడ్డి, సత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనకు ప్రభుత్వం కృషి

ఎస్ఎస్‌తాడ్వాయి: రక్తహీనత నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మేడారం గిరిజన ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం డీఎంహెచ్ఓ ప్రారంభించి మాట్లాడారు. రక్తహీనత లేని భారత దేశంగా తీర్చిదిద్దడమే ఆ కార్యక్రమ ముఖ్య ఉదేశమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 11 ఏళ్ల లోపు కొంత మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి 9 కంటే తక్కువ పర్సెంటేజ్ ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ మాత్రలను నాలుగు వారాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు విపిన్, క్రాంతికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్ కుమార్, శ్రీకాంత్, హెల్త్ సూపర్ వైజర్ ఖలీల్, ఆర్బీఎస్కే వైద్యాధికారులు లెజెండ్, స్వప్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

టేకుమట్ల : ఎదిగే బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికల ఆరోగ్యానికి ఆకుకూరలు, పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలని, సమయపాలన పాటించి భోజనం చేయాలని సూచించారు. ఆహారంలో న్యూట్రిన్, పోషకాలు ఎక్కువగా ఉండే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరం

మొగుళ్లపల్లి : పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరమని శిశువు పుట్టిన గంటలోపు తల్లి పాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో సీమంతాలు, అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడారు. పుట్టిన శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తల్లి పాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలన్నారు. రక్తహీనతతో ఉన్నా తల్లులు ఎక్కువ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలి

టేకుమట్ల : తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సీడీపీఓ అవంతి కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రామకృష్ణాపూర్ (టి) ఎమ్మార్సీ భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవంతి హాజరై మాట్లాడారు.